ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025
5
అల్లూరి సీతారామరాజు

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక జిల్లా శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులు, చిన్నారులకు లెమన్ స్పూన్ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని సునీత మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు, చిన్నారులు సద్వినియోగ పర్చుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కే.సుబ్బారావు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

లెమన్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

అంగరంగ వైభవంగా మోదకొండమ్మ ఉత్సవం

▶▶ తొలిరోజు పోటెత్తిన భక్తులు ▶▶ ఆకట్టుకున్న వినోదాత్మక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు పట్టణంలో ప్రారంభమైన మోదకొండమ్మ జాతర తొలిరోజు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ జామున మంచు ముసుగులో అమ్మ వారి పాదాలు, ఘటాల ఊరేగింపు డప్పు వాయిద్యాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తి పారవశ్యంతో నిర్వహించారు. ఈ కొలువు ఉత్సవంలో భక్తులు అమ్మవారి ఘటాలను ఊరేగించేందుకు ఎగబడ్డారు. శతకంపట్లో అమ్మవారిని కొలువు తీర్చిన తర్వాత సాయంత్రం కూడా పురవీధుల్లో భక్తుల సందర్శనార్థం ఘటాల ఊరేగింపు నిర్వహించారు.. స్థానిక ఎమ్మెల్యే ఆలయ కమిటీ/ ఉత్సవ కమిటీ చైర్మన్ విశ్వేశ్వర రాజు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటి బాబు తదితరులు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పాదాలను ఘటాలను అంగరంగ వైభవంగా ఊరేగించారు.కొలువు ఉత్సవం వివిధ నేల వేషాలు బాణాసంచా, డప్పు వాయిద్యాలతో మారుమోగింది. మూడు రోజుల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల లైటింగ్ సెట్లు, విద్యుత్ దీపాల అలంకరణతో పాడేరు పట్టణమంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విద్యుత్ సెట్టింగ్

తుడుం వాయించి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే తదితరులు

ఆకట్టుకున్న అడ్వెంచర్ రైడ్స్ ఎగ్జిబిషన్

ఉత్సవాలకు తరలివచ్చే భక్తులు సందర్శకుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ప్రభుత్వ కళాశాల క్రీడా మైదానంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. జైంట్ వీల్స్ తో పాటు కొలంబస్ బ్రేక్ డాన్స్ డ్రాగన్ ట్రైన్, జారుడుబల్లలు వంటి వినోదాత్మక సాహసోపేతమైన గేమ్ షోలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. గిరిజన సంక్షేమం అభివృద్ధి పై వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ కూడా ఆకట్టుకున్నాయి. ఉత్సవాల సందర్భంగా పట్టణమంతా వివిధ రకాల వస్తు దుకాణాలు ఏర్పాటయ్యాయి. పాడేరు పట్టణమంతా జన సందోహంతో సందడిగా మారింది

థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

13న మోదకొండమ్మ అనుపు ఉత్సవం

పాడేరులో మూడు మూడు రోజులు పాటు నిర్వహించే మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ముగింపు సందర్భంగా అణుపు ఉత్సవం ఈ నెల 13న మంగళవారం నిర్వహించనున్నారు. అమ్మవారిని కొలువు తీర్చిన శతకం పట్టు నుంచి ఆలయం వరకు పట్టణ పురవీధుల్లో భారీ ఊరేగింపుతో ఈ అనుపు వోత్సవం జరగనుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు అమ్మవారి అనుపోత్సవానికి హాజరవుతారు. మూడు రోజులు మోదకొండమ్మ ఉత్సవాల్ని వైభవంగా నిర్వహించేందుకు ఎప్పటి మాదిరిగానే ఏర్పాట్లు నిర్వహించారు.

ఘటాలను మోస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, అధికారులు

నూనె రమేష్‌కు జాతీయ యువకీర్తి పురస్కారం

రమేష్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తదితరులు

ప్రజాశక్తి-విఆర్‌పురం/ చింతూరు: శ్రీశ్రీ కళావేదిక మే 10,11వ తేదీల్లో నిర్వహించిన ప్రపంచ సాహితీ సంబరాలు కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, చత్తీస్‌గడ్, గుజరాత్, చెన్నై, కర్ణాటక రాష్ట్రాల నుండి 1000 మందికి పైగా కవులు, కళాకారులు, రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం కవి నూనె రమేష్‌కు సాహిత్య, సామాజిక రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి 'జాతీయ యువకీర్తి' ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సిఇఒ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ప్రపంచప్రసిద్ధ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రామావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టె లలిత, సాహితీ సంబరాల కన్వీనర్ పార్థసారధి ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు అందించి ఘనంగా సన్మానించారు. నూనె రమేష్ మూడు కవి సమ్మేళనాల్లో పాల్గొని ప్రపంచరికార్డ్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పదుల సంఖ్యలో జాతీయ శతాధిక కవి సమ్మేళనాల పురస్కారాలు పొంది, ఐదు వందలకు పైగా సామాజిక ఇతివృత్తాలతో కవితలు రాసి రెండు తెలుగు రాష్ట్రాలే కాక ఇతర రాష్ట్రాల్లో కూడా సాహితీ పురస్కారాలు పొందారు. జాతీయ అవార్డు గెలుచుకున్న రమేష్‌ను గ్రామస్తులు, మండల ప్రముఖులు, స్నేహితులు అభినందించారు. ఆయన తల్లిదండ్రులు నూనె అజరయ్య దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రైవేటు బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఎటపాక: ప్రైవేటు బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన వెంకటరెడ్డిపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తోటపల్లికి చెందిన అల్లాడి భాస్కరరావు (62) ద్విచక్ర వాహనంపై భద్రాచలం వెళ్తున్నారు. అదే సమయంలో భద్రాచలం నుంచి చత్తీస్‌గడ్ వెళ్లే ప్రైవేట్‌బస్సు వెంకటరెడ్డిపేట వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్ర గాయాల పాలైన అల్లాడి భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అప్పలరాజు తెలిపారు.

భారీ కొండచిలువ హతం

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని శరభన్నపాలెం గ్రామ శివారులో పొలాల్లో ఆదివారం భారీ కొండచిలువ కనిపించింది. మేత కోసం వెళ్లిన మేకలపై దాడి చేసిందని గ్రామస్తులు తెలిపారు. సుమారు 12 అడుగులకు పైగా పొడవు ఉన్న కొండచిలువను చూసిన మేకల కాపరులు భయంతో పరుగులు తీశారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న స్థానికులు కొండచిలువను హతమార్చారు.

కొండచిలువ

తాగునీటి ట్యాంకు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో గోమంగి పంచాయతీ గోమంగి కాలనీలో మంచినీరు ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు సొంత నిధులతో పిసా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మరమ్మత్తులు చేసుకొన్నారు. గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తడం తో సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నోమార్లు విన్నవించినా పట్టించుకోక పోవడంతో గ్రామస్తులే మరమ్మత్తులు చేయడం జరిగినదని పిసా కమిటీ సభ్యులు, గిరిజన సంఘం నాయకుడు జంపరంగి సునీల్ కుమార్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోమంగి గ్రామంలో మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గోమంగి కాలనీ పెద్ద కూడ కొండబాబు, రుంజలి చిట్టిబాబు, కూడా రత్నం, కూడా ప్రసాద్, కిమూడు సత్యనారాయణ, సీసాల కళ్యాణం పాల్గొన్నారు.

మరమ్మతు చేపడుతున్న గ్రామస్తులు

కాగడాలతో ఆందోళన చేపడుతున్న గిరిజనులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

- కాగడాలతో గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-అనంతగిరి: విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి కొండ శిఖరు దట్టమైన అటవీ ప్రాంతం గూడెం గ్రామస్తులు ఆదివారం రాత్రి కాగడాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ సోమ్మెల. అప్పలరాజు మాట్లాడుతూ, గూడెం గ్రామంలో 20 కుటుంబాలు తాత ముత్తాతల కాలం నుండి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్ళు గడుస్తున్నప్పటికీ ఆ గ్రామానికి కనీసం విద్యుత్ సౌకర్యం ప్రభుత్వం కల్పించ లేదన్నారు. దీంతో, ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, దీన్ని ం నిరసిస్తూ గ్రామంలో కాగడాలతో నిరాశన గిరిజనులు చేపట్టామన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు లిఖితపూర్వకంగా విన్నవించినా పట్టించుకున్న దాఖలు లేవన్నారు. విద్యార్థులు రాత్రుల సమయంలో చదువుకోలేని పరిస్థితితో ఇబ్బందికి గురవుతున్నారని, అర్ధరాత్రి సమయంలో విషపూరితమైన జంతువులు ప్రవేశిస్తున్నాయన్నారు. మహిళలు రాత్రుల సమయంలో టార్చ్ లైట్‌లు వెలిగించి వంటలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. గ్రామంలో పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలు చేస్తున్నప్పుడు విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం తక్షణం స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో పిడుగులు వర్షం కురవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పెదబయలులో చెట్లు నేల కొరిగాయి. రేకుల షెడ్లు, పెంకిటిల్లు పై కప్పులు నేల రాలాయి. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

పెదబయలులో కూలిన చెట్టు

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం 6 గంటల నుంచి ఉష్ణోగ్రత తీవ్రత అధికంగా ఉంది. గత వారం రోజుల నుంచి పోల్చుకుంటే ఉష్ణోగ్రత మరింత తీవ్రమైంది. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారపు సంతకి మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు ఎండ తీవ్రతకు తట్టుకోలేక అనేక ఇబ్బందులు గురయ్యారు. సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని మబ్బులతో కూడిన వాతావరణం నెలకొంది. అనంతరం తేలికపాటి నుంచి అతి భారీవర్షం కురవడంతో రోడ్డు జలమయమైంది. సీలేరు పరిసర ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి ఎండ వేడిమికి తాళలేకపోయిన ప్రజలు వర్షం కురవడంతో ఉపశమనం పొందారు.

దండంగి కాలువలోకి భారీగా గోదావరి నీరు

కాలువలోకి చేరిన నీటితో మునిగిన వంతెన

ప్రజాశక్తి-దేవీపట్నం: మండలంలోని దండంగి కాలువలోకి భారీగా గోదావరి నీరు వచ్చి చేరింది. ఆదివారం ఉదయం భారీగా నీరు చేరడంతో కాలువలో ఉన్న వంతెన, ప్రక్కనే ఉన్న రోడ్డు మునిగిపోయాయి. దండంగి నుంచి అటువైపు వెళ్లడానికి, అటు నుంచి ఇటువైపు రావడానికి ఏ మాత్రం అవకాశం లేదు. వారం రోజుల నుంచి గోదావరి నదిలో నీటిమట్టం క్రమేపి పెరుగుతోంది. ఆదివారానికి ఈ నీటిమట్టం మరింత పెరిగి దండంగి కాలువలోకి భారీగా వచ్చి చేరిందని స్థానికులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద పనులు జరుగుతున్నాయని, అక్కడ గేట్లు మూసివేశారని అందుకే నీటిమట్టం పెరిగిందని స్థానికులు చెప్పారు. గేట్లు మూసివేయడం వల్ల బ్యాక్ వాటర్ ఎగువ ప్రాంతాలకు ఎక్కువగా వస్తుందని చెప్పారు. ఇప్పటికీ గోదావరి నదిలో నీటిమట్టం పెరుగుతూనే ఉందని తెలిపారు. ప్రస్తుతం దండంగి కాలువను దాటడానికి ఎవరూ ప్రయత్నాలు చేయవద్దని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు హెచ్చరించారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- జికెవీధి: జికె వీధి మండలం జర్రెల పంచాయితీ పరిధిలో బిగ్‌టివి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగావైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. జర్రిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మజీద్, డాక్టర్ మణిదీప్, చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి ఆడియాలజిస్ట్ మస్తాన్‌వల్లి సౌజన్యంతో బిగ్‌టివి మీడియా ప్రతినిధి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ రాజు పిలుపుమేరకు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామాల నుంచి సుమారు 150 మంది రోగులు హాజరయ్యారు. అవసరమైన రోగులకు మెరుగైన చికిత్స నిమిత్తం వివిధ ప్రభుత్వ ఆసుపత్రులకు సిఫార్సు చేయగా, వినికిడి లోపం కలిగిన వారికి చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించే విధంగా, వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి సదరం ధ్రువపత్రాన్ని మంజూరు చేసే విధంగా సహాయపడతామని సంబంధిత వైద్యులు తెలిపారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. రోగులకు బిగ్‌టివి మీడియా ప్రతినిధి బిస్కెట్ ప్యాకెట్లను, తాగునీటి బాటిళ్లను అందజేశారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

పడకేసిన పారిశుధ్యం

రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలు

కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రజాశక్తి-చింతూరు: మండల కేంద్రంలోని గుబేలుపేటవీధిలో చెత్త పేరుకుపోయింది. దీంతో మురుగునీరు పోయేందుకు ఆస్కారంలేక దుర్వాసన వెదజల్లుతోంది. చీకటి పడితే దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంది. విషసర్పాలు తిరుగుతూ ఉండటంతో చీకటిపడితే గ్రామస్తులు వీధిలో నడిచేందుకు భయపడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీరనున్న మంచినీటి వెతలు

బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ దుర్జో

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి లైకాన్‌పూర్, చంద్రుపల్లి గ్రామాల్లో తాగునీటి సౌకర్యం లేక ఆయా గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఊరికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊటనీటిని సేకరించి కాలం వెళ్లదీస్తున్నారు. వేసవి కావడంతో ఊటనీరు అడుగంటిపోయి అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. ఆ గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవడం తో బోర్లు వేయడానికి వాహనాలు వెళ్లలేక తీవ్ర జాప్యం జరిగింది. ఎట్టకేలకు గత ప్రభుత్వ హయాంలో 2023లో జల్‌జీవన్ పథకం ద్వారా మంజూరైన రెండు బోర్లు వేయటానికి రహదారి లేకపోవడంతో అధికారులు ఏమీ చేయలేమని చేతులెత్తేశారు. సర్పంచ్ పాంగిదుర్జో స్పందించి పంచాయతీ నిధులతో మట్టి రహదారిని నిర్మించారు. అయినప్పటికీ బోర్లు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం జరిగింది. సర్పంచ్ పాంగి దుర్జో, కూటమి నాయకుల ఆధ్వర్యంలో లైకాన్‌పుర్, చంద్రుపల్లెలో బోరు తవ్వకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి దుర్జో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రామాలకు పంచాయతీ నిధులతో మట్టిరోడ్లు ఏర్పాటు చేశామని, బోర్ల పనులు ప్రారంభించామని పనులు పూర్తయితే తాగునీటి కొరత తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిటెకల రాము వనముల రాము మొండి రమణ నాగేంద్రబాబు బుంగ రాశి తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉన్నా, లేకున్నా ప్రజల పక్షమే

ప్రజాశక్తి-కొయ్యూరు: సిపిఐ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపైనే పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. కొయ్యూరు మండలం కొత్తపల్లిలో పార్టీ మండల సమితి సమావేశం నిర్వహించారు. అధికారంలో ఉన్నా, లేకున్నా సిపిఐ ప్రజల తరపున ఉంటుందన్నారు. మండలంలో నెలకొన్న తాగునీటి, రహదారి తదితర సమస్యలను గుర్తించాలన్నారు. వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని నేతలకు సూచించారు.

మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట: స్థానిక వనరులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చునని కింజరపు ఎర్రం నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. రావికమతం మండలం మత్స్యవానిపాలెం గ్రామంలో ఆదివారం కొండేం పూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టివో టి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్థానిక వనరులను ఉపయోగించు కోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామ ముఖ్య కూడలిలో గ్రామ చిత్ర పటం వేసి వనరులు- లభ్యత అనే అంశం పై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రచన, చెరిష్మా, బిందు మాధవి, మేఘన, అంకిత, మణిదీపిక, రైతు సేవా కేంద్రం సిబ్బంది వెంకటేష్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: కృషి విజ్ఞాన కేంద్రం కొండేంపూడి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కింజరపు ఎర్రమనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం పి భీమవరం గ్రామంలో టైం లైన్ ద్వారా పూర్వకాలం నుండి నేటి వరకు సాగులో ఆధునిక పద్ధతులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, ప్రసన్న, మమత, హేమ, హారిక, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ స్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1999 -2000 సంవత్సరంలో టెన్త్ పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఒక్కటిగా చేరి చిన్ననాటి తీపి స్మృతులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, జీవితంలో పిల్లలు అభివృద్ధి చెందితే తల్లిదండ్రులు తర్వాత ఆనందపడేది గురువులేనన్నారు.పిల్లలు ఉన్నత స్థానంలో ఉంటే గర్వపడేది వీరు ముగ్గురే అన్నారు. ఈర్ష్య ద్వేషాలు ఉండవన్నారు. గురువులు ఆనందపడేది విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నప్పుడే అన్నారు. మీ పిల్లల్ని కూడా మంచి మార్గంలో నడిచేలా చేయాలన్నారు.

బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యం

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసిలకు రాజ్యాధికారమే లక్ష్యమని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు అంగడాల పూర్ణచంద్రరావు తెలిపారు. బిసి సమన్వయ కమిటీ ఉత్తరాంధ్ర సమావేశం ఆదివారం పౌరగ్రంథాలయంలో కట్టా మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, రిజర్వేషన్లను 50 శాతం లిమిట్ చేయడాన్ని ఎత్తివేయాలని, ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను పున్ణ సమీక్షించాలని కోరారు. చట్టసభల్లో బిసి రిజర్వేషన్లు కల్పించాలని, మహిళ రిజర్వేషన్లను బిసిలకు కల్పించాలని, బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, ప్రయివేట్ రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమస్యలపై బిసి సమన్వయ కమిటీ పోరాటం చేస్తుందన్నారు. బిసిలందరినీ కలుపుకుని పార్టీలకతీతంగా బిసి సమస్యలపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో ఆరు జిల్లాలకు అధ్యక్ష కార్యదర్శులను, నియోజకవర్గ, మండల, గ్రామ కమిటీలను నిర్మాణం చేసుకొని పోరాటం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో బిసి సమన్వయ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడంరెడ్డి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, కోశాధికారి పొట్లూరి దేవి, అధికార ప్రతినిధి అల్లు రమణ కార్యవర్గ సభ్యులు గోగుల ఆంజనేయులు పోచా రమేష్, ఒర్సు భాస్కర్, ఎర్రగుంట్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ కేంద్రంలో పరీక్షలు రాయనున్నట్లు ప్రిన్సిపల్ పి.రామ్‌ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు సుమారు 329 మంది, సెకెండ్ ఇయర్ విద్యార్థులు సుమారు 60 మంది పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. ఫస్ట్ ఇయర్ రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్‌కు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించ బడవని స్పష్టం చేశారు.

మరమ్మతుకు నోచని.. జల్ జీవన్ మిషన్ కుళాయిలు

-కలుషితమైన ఊట నీరే ఆధారం
-పట్టించుకోని అధికారులు

నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని బొండం పంచాయితీ కొత్తవలస గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద సుమారు 10 లక్షల రూపాయలు వెచ్చించి ట్యాంక్ నిర్మించి, ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. కుళాయి వేసిన కొద్ది రోజులకే మరమ్మతులకు గురయ్యాయి. దీంతో, గిరిజనులు తాగునీటికై అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కలుషితమైన ఊట గెడ్డ నీటిని సేవించి రోగాల పాలవుతున్నామని గిరిజనులు వాపోతున్నారు.

ఈ గ్రామంలో సుమారు 60 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నారు. గత రెండు నెలల క్రితం గ్రామంలో కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయని, ఈ విషయమై పంచాయతీ పాలకవర్గం, అధికారులకు పలుమార్లు వేడుకొన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో, తాగునీటి కోసం గ్రామంలోని మహిళలు ఊటగెడ్డలను ఆశ్రయిస్తున్నారు. ఈ నీరు తాగడంతో గ్రామంలో అనేకమంది చిన్నారులు, పెద్దవాలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్న ఊటగెడ్డలు చెత్తాచెదారంతో నిండాయని, ఈ నీటిని తాగునీరుగా వినియోగించడం జరుగుతుందని మహిళలు, గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఇంతవరకు పరిష్కరించక పోవడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మొక్కుబడిగా సందర్శించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మర్చిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి ఇంటింటి కొళాయిలను మరమ్మత్తు చేపట్టి గ్రామంలో తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలినడకన ఊట గెడ్డ నీటిని తెచ్చుకుంటున్న మహిళలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

కుళాయి మరమ్మతులకు గురైందని పంచాయతీ అధికారులకు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు. గ్రామంలో తాగునీరు లేక కలుషితమైన ఊటగెడ్డ నీరు సేవించి అనారోగ్యం పాలవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొళాయి మరమ్మతులు చేసి గ్రామస్తులను తాగు నీటి అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేస్తాం.

గత్తుం బుజ్జి బాబు,
ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి

లాండ్రీ షాపులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

ధర్నా చేస్తున్న రజక వృత్తిదారులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రజకుల లాండ్రీ షాపులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని లాండ్రీ వృత్తిదారుల సంఘం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సీతమ్మపేట రజకుల ధోబీఘాట్ వద్ద ఎం.అప్పారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రపంచీకరణ సరళీకరణ విధానాలు అమలు చేయడం వల్ల చేతి వృత్తిదారులు వృత్తి, ఉపాధి, కోల్పోతున్నారన్నారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు రావడం వల్ల వృత్తిదారులు రోజు కూలీలుగా చేస్తున్నారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ అమలు చేస్తే చేతి వృత్తిదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీనగర్, సీతమ్మపేట దోబీ ఘాట్లు వద్ద రజక వృత్తిదారులు 30 కుటుంబాలు రజక వృత్తి, లాండ్రీ షాపులు నిర్వహిస్తూ అక్కడే నివసిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో రజక వృత్తిదారులు వృత్తి చేయుటకు దోబీ ఘాట్లు లేక, లాండ్రీలు చేయుటకు స్థలాలు లేక, నివసించుటకు పక్కా ఇల్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రజకుల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదన్నారు. రజకులకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, జిఇ 18 ప్రకారం రజకుల లాండ్రీలకు స్థలం కేటాయించాలని, బిసి కార్పొరేషన్ ద్వారా లాండ్రీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 20న జరుగుతున్న కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యాన చేపట్టే దేశవ్యాప్త సమ్మెకు మద్దతు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.ఈశ్వరరావు, ఎం.అప్పారావు, ఆర్.పోలయ్య, ఆర్.సత్యనారాయణ, టి.లక్ష్మి, వి.ముసలయ్య, కె.లక్ష్మణ, పి.సింహాద్రి, ఎం.నాగమణి పాల్గొన్నారు.

సింహాచలం ఇఒగా సుజాత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పెందుర్తి: దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత ఆదివారం సింహాచలం దేవస్థానం ఇఒగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఇఒగా మొదటిగా అప్పన్నను దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి నక్కాన ఆనంద్‌కుమార్, ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు సాదర స్వాగతం పలికారు. సుజాత ముందుగా కప్పస్తంభం ఆ లింగనం చేసుకొని, తదుపరి బేడా మండపం ప్రదక్షిణ చేశారు. అనంతరము పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. డిఇఇ డివి.రామరాజు, జివిఎస్‌కె.ప్రసాద్, కంచి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన గోపాలపట్నంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలేనికి చెందిన అక్కిరెడ్డి బాబూరావు (52) ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మందుల కోసం గోపాలపట్నం హైస్కూల్ వైపుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో గోపాలపట్నం ప్రధాన రహదారి నుంచి హైస్కూల్ కింద రహదారీలో లారీ వస్తూ హైస్కూల్ గేటు వద్ద మలుపు తిరిగే క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. బాబూరావు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ తాతారావు (20) కూలి పని చేసుకుంటూ పశువులను కాస్తుంటాడు. మద్యం అలవాటు ఉన్నందున పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం పశువుల షెడ్ వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో తప్పిన ముప్పు

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో పెను ప్రమాదం తప్పింది. ఎండాడ పెట్రోల్ బంక్ సమీపంలో డివైడర్‌పై ఇనుప గ్రిల్స్‌ను ఢీ కొట్టి అవతలి రోడ్డులోకి కారు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ కారు నగరం నుంచి మధురవాడ వైపు వెళుతున్నట్లు స్థానికులు తెలిపారు. కారుకు అడ్డుగా ద్విచక్ర వాహనం రావడంతో దాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురి అయినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కాస్మిక్ హౌస్ రెస్టో బార్ పబ్‌పై కేసు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని ప్రభుత్వ అతిథి గృహం సమీపంలోని కాస్మిక్ హౌస్ రెస్టో బార్ పబ్ లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించి రాత్రి 1:30 గంటల వరకు కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు పోలీసుల దృష్టికి రావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంటు, త్రీ టౌన్ పోలీసులు సంయుక్తంగా సదరు పబ్‌పై శనివారం రాత్రి దాడులు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఆ పబ్‌కు మంజూరైన లైసెన్స్ ప్రకారం మద్యం అమ్మకానికి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, అలాగే ఆహార సరఫరాకు రాత్రి 12 గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంది. ఆ నిబంధనను ఉల్లంఘించి రాత్రి 1.30 గంటల వరకు పబ్‌ను నడిపించినందున చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని త్రీ టౌన్ సిఐ పైడయ్య తెలిపారు.

ఆరుగురు జూదరులపై కేసు

ప్రజాశక్తి-కశింకోట: మండలంలో బయ్యవరం గ్రామ పరిసర ప్రాంతంలోని మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ స్వామినాయుడు తెలిపారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించగా పేకాటాడుతూ పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ. 28,040 నగదు, 5 బైకులు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ మనోజ్ కుమార్, రైటర్ నారాయణరావు, కానిస్టేబుళ్లు మూర్తి, లక్ష్మణ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పట్టుబడ్డ జూదరులతో పోలీసులు

ఘనంగా ప్రతాప్‌రుద్ర జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: చినవాల్తేరు మహమ్మదీయ మస్జిద్ ఆవరణలో తూర్పు శాసనసభ్యుడు వెలగపూడి రామకష్ణబాబు కుమారుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర జన్మదినం సందర్భంగా, మహమ్మదీయ మస్జిద్‌యూత్ ఆధ్వర్యంలో గౌసేపాక్ నిషానీవద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రతాప్‌రుద్రసా కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు పంపిణీ చేసి అనంతరం మదర్సా విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్స్, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, టిడిపి నాయకులు పీతల అవినాష్‌యాదవ్, ముస్లింపెద్దలు యూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రాజకీయ విధానం అవసరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రాలలోని ప్రాంతీయ పార్టీల మధ్య విభేదాలు సృష్టించి, రాష్ట్రాల్లోనూ అధికారంలోకి రావాలని బిజెపి ప్రయత్నిస్తోందని, దీన్ని గుర్తించి ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని రూపొందించాల్సిన అవసరముందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు బిజెపి అన్ని దుర్మార్గాలకూ పాల్పడుతోందని, రాజకీయ ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. విశాఖలో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన దేశంలోని రాజకీయ వాతావరణం, పార్టీ కార్యాచరణ, పార్టీ నిర్మాణం తదితర అంశాలపై మాట్లాడారు.

మతాన్ని రాజకీయ ఆయుధంగా బిజెపి వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల మధ్య చిచ్చుపెట్టి, చీల్చి తమ వైపు తిప్పుకొని అధికారంలోకి వస్తోందని విమర్శించారు. అయితే బిజెపి ప్రయత్నాలు అన్నిసార్లూ పనిచేస్తాయని భావించాల్సిన అవసరం లేదన్నారు. మనదేశంలో ప్రజలు మతం ఆధారంగా ఓట్లు వేసే పరిస్థితి లేదని చెప్పారు. 2014లో కాంగ్రెస్ అవినీతి, కుంభకోణాల వల్ల బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆ పార్టీ చెప్పిన డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూడోసారి 420 సీట్లు సొంతంగా గెలుస్తామని చెప్పి నేరుగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సీట్లు కూడా బిజెపి తెచ్చుకోలేకపోయిందని గుర్తు చేశారు. తొలుత సిపిఐ సీనియర్ నాయకులు పల్లెటి పోలయ్య పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కె.వనజాక్షి, కె.సత్య నారాయణ, ఆర్.శ్రీనివాసరావు అధ్యక్ష వర్గంగా మహాసభకు వ్యవ హరించారు.

పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, పి.దుర్గా భవాని, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్య నారాయణమూర్తి, ఎజె.స్టాలిన్, డి.ఆదినారాయణ, సిహెచ్. రాఘవే ద్రరావు, ఎం.పైడిరాజు పాల్గొన్నారు

సిహెచ్‌ఒలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్‌ఒ)ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 14వ రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డిమాండ్లతో కూడిన బ్యానర్ ప్రదర్శిస్తూ సిహెచ్‌ఒలు నిరసన తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు. ఇపిఎఫ్‌ను పునరుద్ధరించాలన్నారు. పిఎఫ్ కటింగ్ రెండు సంవత్సరాలుగా నిలిపివేశారని, ఇది సరికాదని, పాతపద్ధతిని కొనసాగించాలన్నారు. నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ అందించాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ నుంచి సిహెచ్‌ఒలకు మినహాయింపునివ్వాలన్నారు. కార్యక్రమంలో కల్పన, దివ్య, కల్యాణి, భవాని, అరుణ, మానస పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంఎస్ఎంఇ సెట్

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ:

భారతప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంఎస్ఎంఇ సెట్ 2025 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్ ఎన్ విజయమోహన్ తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీతో పాటు అచ్యుతాపురంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్లో నిర్వహించిన ఈ పరీక్షకు 600 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా విశాఖపట్నంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ కేంద్రంలో 219 మంది విద్యార్థులకు గాను 178 మంది, అచ్యుతాపురంలోని ఎమ్మెస్సార్ ఇ టెక్నాలజీ సెంటర్లో 381 మందికి గాను 219 హాజరయ్యారని ఆయన తెలిపారు. ఈ పరీక్షలు సెంటర్‌ఫర్‌డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ పర్యవేక్షణలో ఎంఎస్ఎంఈసెట్ 2025 కన్వీనర్ ప్రొఫెసర్ వి.సిద్దయ్య, డిప్యుటి జనరల్ మేనేజర్ జి.ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. పరీక్షా ఫలితాలను ఈ నెల 19వ తేదీన విడుదల చేస్తామనిఆయన తెలిపారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎయులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఐఎఎస్ఈ (ఇన్స్టిట్యూట్ అఫ్ అడ్వాన్స్డ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్) కళాశాలలో 2001- 2002 బ్యాచ్‌కు చెందిన బిఇడి పూర్వ విద్యార్థుల సమ్మేళనం(రీయూనియన్) ఆదివారం నిర్వహిం చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ప్రస్తుతం వారు పనిచేస్తున్న వత్తి వ్యక్తిగత జీవితం గురించి ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి వారి ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజాకుమారి, ఆచార్య శివప్రసాద్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ విద్యావతిలను ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని దానికి తమ ఇఐఎస్ఇ పూర్వ విద్యార్థులే ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో పేదవిద్యార్థులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు.

ఉగ్రవాద నిర్మూలనకు ప్రపంచ దేశాలు కలిసిరావాలి

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:

ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడం ద్వారా ప్రపంచశాంతి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యావిభాగంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉగ్రవాదాన్ని నిర్మూలిద్దాం, దేశ సమైక్యతను పెంపొందిద్దాం మేరాభారత్ మహాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద నిర్మూలనకు భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కి ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల నుంచి సంఘీభావం లభిస్తోంద ని చెప్పారు. ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించే దిశగా ప్రపంచ దేశాలన్నీ సమిష్టిగా కలసి పనిచేయాలని ఆయన సూచించారు. దేశాల అభివద్ధికి తీవ్రవాదం అవరోధంగా నిలుస్తోందన్నారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ భారతదేశం ఎల్లప్పుడు శాంతిని కోరుకుంటుందని అదే సమయంలో తమ దేశ ప్రజలకు ముప్పు తలపెట్టేవారిని ఎంత మాత్రం ఉపేక్షించదన్నారు.కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు డాక్టర్‌ప్రకాష్, డాక్టర్‌ఆలీ పాల్గొన్నారు. ఆచార్య సూర్య ప్రకాష్‌ను సత్కరించారు.

మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

భూ ఆక్రమణలపై మౌనమేల...!

రోడ్డు పక్కనే వాగుల చదును
జోరుగా శాశ్వత భవన నిర్మాణాలు
పరవాడలో ప్రభుత్వ భూములు పరుల పరం
చర్యలకు రెవెన్యూ వెనుకడుగు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి/ పరవాడ విలేకరి : జిల్లాలోని పరవాడ మండల కేంద్రంలో ప్రజలు నిత్యం తిరిగే రహదారి పక్కనున్న ప్రభుత్వ వాగులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణల పాలవుతున్న కోట్ల విలువైన వాగులు, ప్రభుత్వస్థలాల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. స్థానికులు చేసిన ఫిర్యాదులపైనా వారు స్పందించడం లేదు. దీంతో ఆక్రమణదారులకు సహకరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ఈ బోనంగి సర్వే నంబర్ 297లో గెడ్డవాగు 76 సెంట్లు, పాతగొర్లెవానిపాలేనికి వెళ్లే దారికి అనుకుని, ప్రధాన రహదారి పక్కనున్న సర్వే నంబర్ 293లో ఎకరా 36 సెంట్లు గెడ్డవాగును ప్రయివేటు వ్యక్తులు చదునుచేసి ఆక్రమించారు. ఈ రెండు సర్వే నెంబర్లలో రెండెకరాల 12 సెంట్లు భూమి విలువ రూ.30 కోట్లకుపైగా ఉంటుంది. విశాఖపట్నం, యలమంచిలి ప్రధాన రహదారిలో పరవాడ పోలీసుస్టేషన్‌కు సమీపంలో ఈ ఆక్రమణలు ఎంతోకాలంగా సాగుతున్నాయి. స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగో, మొహమాటమో ఏమోగానీ మండల స్థాయి రెవెన్యూ అధికారులు అచేతనంగా వ్యవహరిస్తున్నారు. ఆర్‌డిఒ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్ సైతం కఠినంగా లేకపోవడంతో ప్రభుత్వ భూములు, వాగులు ఇలా పరుల పరమవుతున్నాయి. భూ ఆక్రమణలపై ఉదారం వీడి నిష్పాక్షిక విచారణ, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ వంటి నిఘాను పటిష్టపర్చి చర్యలు తీసుకుంటే కొంతవరకైనా ఆక్రమణలు తగ్గేవి. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న భూ ఆక్రమణలపై కలెక్టర్ సైతం మౌనం వహించడంతో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, భవన నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండలంలోని ఈ బోనంగి సర్వే నెంబర్ 297లో 76 సెంట్లు, సర్వే నెంబర్ 293లో ఎకరా 36 సెంట్లు గెడ్డవాగు ఆక్రమణ ఎంతో కాలంగా జరుగుతోంది. ఆక్రమణలను నియంత్రించకుండా సహకరించేలా కొంతమంది రెవెన్యూ అధికారులు వ్యవహరించడంతో ఆక్రమణలు రెట్టింపు అవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలు, వాగులు చదునుచేసినప్పుడు అడ్డుకోకుండా సొమ్ము చేసుకోవడానికి కొంతమంది రెవెన్యూ సిబ్బంది అలవాటు పడటంతో ప్రయివేటు వ్యక్తుల ఆక్రమణలకు ఊతమిచ్చినట్లవుతోంది. 293 సర్వే నంబర్‌లో గెడ్డను కప్పి అక్రమించడంపై 2018లో స్థానికులు ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై చేపట్టిన విచారణలో ప్రభుత్వభూమిగా గుర్తించారు. ఆ ప్రభుత్వ భూమిలోకి అనుమతిలేకుండా ప్రవేశించినా, అక్రమించడానికి ప్రయత్నించినా సెక్షన్ 4 (1), (2), (3) కింద ఎపి ల్యాండ్ గ్రాబింగ్‌యాక్టు 1982 ప్రకారం చర్యలు తీసుకుంటామని నాటి కలెక్టర్ హెచ్చరిక బోర్డు పెట్టించారు. ప్రభుత్వ భూమిలో కలెక్టర్ పెట్టించిన బోర్డును తొలగించి, వాగును కప్పేసి, భూమిని చదునుచేసి బస్సులు, ఇతర వాహనాలు పార్కింగ్ చేసేందుకు ఆ స్థలం వినియోగిస్తున్నారు. హెచ్చరిక బోర్డు తొలగించి వాగు ఆక్రమించిన వ్యక్తిపై చర్య తీసుకోవడానికి రెవెన్యూ అధికారులు వెనుకాడు తున్నారు. సర్వే నంబర్ 297లో వాగుగా ప్రభుత్వ రికార్డుల్లోవున్న 76 సెంట్లును వెబ్‌ల్యాండ్‌లో జిరాయితీ గా నమోదు చేసి అక్రమణదారులకు అండగా మండల రెవెన్యూ సిబ్బంది నిలబడ్డారు.

ఈ వ్యవహారం బయటకు వచ్చాక స్థానికుల ఫిర్యాదుతో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన వాగు స్థలాన్ని రెడ్ మార్క్‌లో పెట్టారు. మార్పులు, చేర్పులకు తమకున్న అధికారిక అవకాశాలను అక్రమణదారులకు తోడ్పడ్డానికి ఉపయోగిస్తున్నారు. అక్రమణదారులతో కుమ్మక్కయి కొందరు అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. తహశీల్దార్ కార్యాలయం వెనుకవున్న మినరల్ వాటర్ ప్లాంట్ స్థలంలో కొంత ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులకు చెందినదంటూ ఆక్రమణ జోలికి వెళ్లడంలేదు. జాయింట్ సర్వే చేయాలని దాదాపు రెండేళ్ల క్రితం తహశీల్దార్ దృష్టికి నీటిపారుదల శాఖాధికారులు తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇంత జరుగుతున్నా ఈ ఆక్రమణలు తమ దృష్టికి రాలేదని రెవెన్యూ అధికారులు చెబుతుండటం గమనార్హం.

ఆక్రమిత స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలు